క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

చిల్పూరు: చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తాళ్లపల్లి వెంకటయ్యకు మంజూరైన రూ. 1.50లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంగళవారం అందజేశారు. సర్పంచ్ లింగారెడ్డి, ఎంపీటీసీ ఉమసమ్మయ్య, రమేష్‌నాయక్, జనగాం యాదగిరి, హరిబాబు, విజయ్ ఉన్నారు.

మంత్రిని కలిసిన ప్రవీణ్



జనగామ రూరల్: మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంగళవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు లోకుట్ల ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బచ్చన్నపేట: మండలంలోని పలు సబ్ స్టేషన్ల పరిధిలో నేడు (బుధవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈలు రాజ్‌కుమార్, నర్సింహారెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ పలు మరమ్మతు పనుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు త్రీ ఫేజ్ కరెంట్ నిలిపివేయడం జరుగుతుందన్నారు. బచ్చన్నపేట, ఆలింపూర్, లక్ష్మాపూర్, నారాయణపురం, పడమటికేశ్వాపూర్, రామచంద్రాపురం గ్రామాల్లోని సబ్ స్టేషన్ల పరిధిలో త్రీ ఫేజ్ కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని చెప్పారు. సింగిల్ ఫేజ్ కరెంటు మాత్రమే ఉంటుందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

కోతుల బెడదను నివారించాలి



పాలకుర్తి: మండలంలోని ఈరవెన్నులో కోతుల బెడదను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. మంగళవారం గ్రామానికి చెందిన ఓ ఇంట్లో కోతులు చొరబడి 50 కిలోల బియ్యం, ఇతర సామగ్రిని ధ్వంసం చేశాయి. రోజురోజుకూ కోతులు విపరీతంగా పెరిగిపోతున్నాయని వాటి బారి నుంచి రక్షణ కల్పించాలని గ్రామస్తులు కోరారు.

భూమిపూజ



జనగామ రూరల్: గానుగుపహాడ్‌లో సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు మంగళవారం భూమిపూజ చేశారు. ఎంపీటీసీ బాలస్వామి, గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు. గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు.

కొనుగోలు చేసిన భూమిని పట్టా చేసి ఆదుకోండి

స్టేషన్‌ఘన్‌పూర్: 22 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన వ్యవసాయ భూమిని ఇంతవరకూ తమ పేరిట పట్టా చేయకుండా కాలయాపన చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకొని తమ పేరిట చేయాలని కుంచం కార్యవర్ధిరాజు కోరుతున్నాడు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద రైతు విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిల్పూరు మండలం కొండాపూర్‌కు చెందిన కార్యవర్ధిరాజు.. పసునూరి నరేందర్ రెడ్డి వద్ద 2011 జనవరి 19న సర్వే నంబర్ 180/ఏ/4/4లో రెండు ఎకరాల 1 గుంట భూమి అప్పటి ఖరీదు ప్రకారం కొనుగోలు చేశాడు. అప్పటి నుంచి కోర్టులో ఉందని, రేపు, మాపు పట్టా చేస్తానని కాలయాపన చేశారన్నారు. ఈ విషయమై పలుమార్లు రెవెన్యూ, పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, అయినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రస్తుతం కాస్తులో మేమే ఉన్నామని, సదరు భూమి తమదేనని గ్రామ పెద్దలందరికీ తెలుసునని, అధికారులు విచారణ చేపట్టి సరైన న్యాయం చేయాలని కోరాడు. లేనిపక్షంలో ఆత్మహత్యే శరణ్యమని వాపోతున్నాడు.

అష్టదళ పాద పద్మారాధన పూజ

చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి సన్నిధిలో మంగళవారం భక్తజన సందోహం నడుమ ఘనంగా అష్టదళ పాద పద్మారాధన పూజ నిర్వహించారు. ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో 108 బంగారు పుష్పాలు, వెండి పాదపద్మాలతో అర్చకులు వేద మంత్రాల నడుమ స్వామి వారికి ప్రత్యేక పూజ చేశారు. అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్రనాగరాజు, కుంచాల సంపత్‌రాజు, శ్యాంసుందర్‌రెడ్డి, సిబ్బంది రమేష్, వీరన్న, మల్లికార్జున్, లక్ష్మి, స్వరూప, కృష్ణ, మహేష్, హరిశంకర్, రాజేష్ పాల్గొన్నారు.

29న హుండీల లెక్కింపు..

ఈనెల 29వ తేదీన ఆలయ ప్రాంగణంలో హుండీలను లెక్కించనున్నట్లు ఈఓ తెలిపారు. ఆసక్తిగల భక్తులు ఉదయం 10 గంటలకు హుండీల లెక్కింపులో పాల్గొనాలని అన్నారు.

టూరిజం అభివృద్ధికి మోక్షమెప్పుడో!

- రెండేళ్లవుతున్నా ముందుకు సాగని పరిస్థితి
- కేవలం సీసీ రోడ్డు పనులకే పరిమితం



జఫర్‌గఢ్‌లో అసంపూర్తిగా నిర్మించిన సీసీ రోడ్డు

జఫర్‌గఢ్: గత ప్రభుత్వం ఎంతో అర్భాటంగా కోట్లాది రూపాయలు వెచ్చించి మండల కేంద్రంలో టూరిజం అభివృద్ధి పనులు చేపట్టింది. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ అలసత్వంతో పనులు ముందుకు సాగడం లేదు. టూరిజం అభివృద్ధి పనులు మొదటి దశలోనే ఉండడంతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోనే చారిత్రక ప్రాంతమైన జఫర్‌గఢ్‌ను పర్యాటక శాఖ ద్వారా పలు అభివృద్ధి పనులు చేపట్టి పర్యాటక కేంద్రంగా మార్చేందుకు అప్పటి ప్రభుత్వం ముందుకొచ్చింది. జఫర్‌గఢ్‌లో కోట కట్టడాలతో పాటు ఎత్తైన పడమర కొండపై ప్రసిద్ధిగాంచిన లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయానికి ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా పలు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. నాటి ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని టూరిజం శాఖ ద్వారా అభివృద్ధి చేసేందుకు రూ.4.40 కోట్ల నిధులను మంజూరు చేసింది. నిధులతో లక్ష్మీనర్సింహస్వామి కొండపైకి భక్తులు వాహనాల్లో పాలగుండం వరకు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణం, కొండపైన భక్తులు స్నానాలకోసం దేవునిగుండం చుట్టూ మెట్లను నిర్మించడంతో పాటు తదితర పనులను యుద్ధప్రాతిపాదికన చేయాల్సిన అధికారులు కేవలం కిలో మీటరు వరకు సీసీ రోడ్డు నిర్మించి చేతులు దులుపుకున్నారు. రెండేళ్లు కావొస్తున్నా ఇప్పటి వరకు సీసీ రోడ్డు పనులు కూడా పూర్తి స్థాయిలో జరగలేదు. మిగతా పనులు సైతం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

స్థలం ఎంపికలో అధికారుల తప్పిదం..

భక్తులు, పర్యాటకుల కోసం కొండ దిగువన నిర్మించాల్సిన విశ్రాంతి భవనాలు, క్యాంటిన్ల నిర్మాణ స్థల విషయంలో సంబంధిత అధికారులు ముందుగా కొండ దిగువన ఉన్న రామాలయం సమీపాన నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కాగా, ఈ స్థలంలో గుట్టబండ ఉండడం, కొంత స్థలం ప్రైవేట్ వ్యక్తులది కావడంతో భవనాలు నిర్మించేందుకు అధికారులు సుముఖత చూపలేదు. ఈ స్థలానికి కొద్ది దూరంలో ఉన్న కందకం వద్ద నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఇది నిర్ణయించి కూడా ఏడాదవుతున్నా పనులు చేపట్టే విషయంలో సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది.

కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు..

టూరిజం సంబంధించిన పనులు చేపట్టేందుకు సదరు కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు. కొండపైకి సీసీ రోడ్డు నిర్మించాల్సి ఉండగా కిలోమీటర్ నిర్మించి కాంట్రాక్టర్ వదిలేశాడు. మిగతా పనుల విషయంలో కాంట్రాక్టర్‌కు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇదే విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇంకా 200 మీటర్లు సీసీ రోడ్డుతో పాటు విశ్రాంతి, పరిపాలన, క్యాంటిన్ భవనాలు తదితర నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.

\- జీవన్‌కుమార్, డీఈ, ఆర్అండ్‌బీ

పనులు వెంటనే చేపట్టాలి



టూరిజం పనులు వెంటనే చేపట్టాలి. పనులు ప్రారంభించి రెండేళ్లవుతున్నా ఇప్పటి వరకు సీసీ రోడ్డు మాత్రమే నిర్మించారు. ఇది కూడా అసంపూర్తిగానే ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పనులు చేపట్టాలి.

\- కాట కుమార్, జఫర్‌గఢ్

రెండేళ్లవుతున్నా పనులు చేపట్టడం లేదు



అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రెండేళ్లవుతున్నా టూరిజం పనులు చేపట్టడం లేదు. కేవలం కిలో మీటర్ వరకు మాత్రమే సీసీ రోడ్డును నిర్మించి వదిలేశారు. ఇంకా కొండపైకి సీసీ రోడ్డు, మెట్లు, విశ్రాంతి భవనాలు, క్యాంటిన్లు నిర్మించాల్సి ఉంది. వెంటనే పనులపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి.

\- ఉల్లి శివరాజు, వడ్డెగూడెం

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ



పడిపూజలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: హరిహర సుతుడు అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవాన్ని మండలంలోని పాంనూర్‌లో సర్పంచ్ కోతి రేణుక, రాములు, వారి కుమారులు కన్నెస్వామి కోతి అరవింద్‌గౌడ్, భక్తుడు కోతి అనుదీప్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం వారి నివాసంలో ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప పడిపూజ మహోత్సవంలో ముందుగా అయ్యప్ప భక్తులు, మాలధారణ చేసిన స్వాములు భజనలు చేశారు. స్వామియే శరణం అయ్యప్ప శరణుఘోషతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పడిపూజలో ప్రధాన ఘట్ట మైన అయ్యప్ప పడి వెలిగించే సమయంలో మాలధారణ చేసిన స్వాములు భక్తి తన్మయత్వం పొందారు. అనంతరం స్వాములంతా సామూహికంగా భిక్ష చేశారు. కాగా, అయ్యప్ప పడిపూజకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరై అయ్యప్పస్వామికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలధారణతో 41 రోజులు కఠిన దీక్ష చేయడంతో మానసిక ప్రశాంతత, ఆరోగ్యంగా ఉంటారన్నారు. నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అయ్యప్పస్వామిని పూజించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

‘జఫర్‌గఢ్ మండలాన్ని భద్రాద్రి జోన్‌లో కలపాలి’



మాట్లాడుతున్న నాయకులు

జఫర్‌గఢ్: జఫర్‌గఢ్ మండలాన్ని వెంటనే భద్రాద్రి జోన్‌లో కలుపాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకుడు నాయిని రామస్వామి, మండల నాయకుడు తాటికాయల శోభన్‌బాబు, మాజీ ఎంపీటీసీ తాటికాయల ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జఫర్‌గఢ్ మండలాన్ని యాదాద్రి జోన్‌లో చేర్చడంతో ఈ ప్రాంత విద్యార్థులకు అన్యాయం జరుగుతున్నదన్నారు. మండలాన్ని భద్రాద్రి జోన్‌లో చేర్చాలని అప్పట్లో విద్యార్థులు, ప్రజలు పలుమార్లు కోరినప్పటికి గత పాలకులు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని తక్షణమే జఫర్‌గఢ్ మండలాన్ని భద్రాద్రి జోన్‌లో చేర్చి వారికి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు సముద్రాల ఎల్లయ్య, మంచాల కుమార్, తాటికాయల మల్లయ్య, తాటికాయల రవి, మంచాల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అభినందనీయం



క్రీడాకారులను సన్మానిస్తున్న శ్రీధర్‌రావు

చిల్పూరు: క్రీడల్లో గ్రామానికి మంచి పేరు తేవడం అభినందనీయమని చిల్పూరు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పొట్లపల్లి శ్రీధర్‌రావు అన్నారు. పల్లగుట్టలో మంగళవారం గ్రామానికి చెందిన క్రీడాకారులు గాజర్ల ఉదయ్, ఇసురం బన్ని ఇటీవల కాకతీయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అంతర్ కళాశాలల చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించగా వారిని సన్మానించడంతో పాటు కిరణ్‌కు రూ.10వేలు, బన్నికి రూ. 5 వేలు నగదు అందజేశారు. కాగా, ఈనెల 29న ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరిగే నేషనల్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలకు ఉదయ్ ఎంపికయ్యాడని తెలిపారు. చిర్ర నాగరాజు, అశోక్‌పాల్, రత్నాకర్‌రెడ్డి, జీడి ఆనందం, జీడి రమేశ్, సుధాకర్, నర్రెంముల రాములుయాదవ్, జయప్రకాష్, చొక్కయ్య, కృష్ణ, మనోజ్ పాల్గొన్నారు.

కోఆప్షన్ సభ్యుడి ఎన్నికకు తీర్మానం



మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్)లో ఖాళీగా ఉన్న 6వ టీసీ(ఛాగల్లు) స్థానానికి కోఆప్షన్ సభ్యుడి ఎన్నిక జరపాలని సభ్యులందరం ఏకగ్రీవ తీర్మానం చేశామని, ఇందుకు అనుమతి కోరుతూ డీసీఓకు తీర్మానం పంపామని ఘన్‌పూర్ పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల నరేందర్‌రెడ్డి అన్నారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో మంగళవారం సీఈఓ మగ్దుం అలీ అధ్యక్షతన డైరెక్టర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడారు. గతంలో ఖాళీ అయిన 6వ టీసీ స్థానంలో డైరెక్టర్ల ద్వారా కోఆప్షన్ సభ్యుడి ఎన్నిక కోసం సభ్యుల మెజార్టీ ఆమోదం మేరకు తీర్మానం చేసినట్లు తెలిపారు. కోఆప్షన్ సభ్యుడి ఎన్నిక కోసం జిల్లా సహకార అధికారిని కోరుతూ తీర్మానాన్ని పంపించామన్నారు. డీసీఓ ఆదేశాల మేరకు త్వరలో కోఆప్షన్ సభ్యుడి ఎన్నిక నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కాగా, ఇంతకాలం సైలెంట్‌గా ఉండి ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, త్వరలో పంచాయతీ ఎన్నికలు జరగనుండగా ఈ టీసీ స్థానానికి కోఆప్షన్ సభ్యుడి ఎన్నిక ప్రస్తావన వచ్చిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత చైర్మన్ కాంగ్రెస్ పార్టీ కావడంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. ఏది ఏమైనా వారి పదవీ కాలం 2025 ఫిబ్రవరి వరకు ఉంది. కార్యక్రమంలో డైరెక్టర్లు చింత ఎల్లయ్య, చట్ల యాకయ్య, తోట సత్యం, చిర్ర నాగరాజు, మారెపల్లి కిషన్‌రెడ్డి, ఉమ్లా నాయక్, వక్కల లక్ష్మి, సత్తిరెడ్డి, తోట అంజయ్య పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన అవసరం



చిల్పూరు: సంక్షేమ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీటీసీ జీడి ఝాన్సీ అన్నారు. మండలంలోని పల్లగుట్టలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా జాతీయ బ్యాంకుల ద్వారా అందజేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్‌బీఐ బ్యాంకు సిబ్బంది రాకేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జాతీయ బ్యాంకుల ద్వారా ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలు, సబ్సిడీ రుణాలపై అవగాహన కల్పించారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీను, పంచాయతీ కార్యదర్శి బాపునాయక్, ఆనందం, సంపత్‌రాజు, వెంకట్రాజం తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి



నివాళులర్పిస్తున్న మల్లయ్య

రఘునాథపల్లి: గీత వృత్తే ఆధారంగా కుటుంబాన్ని పోషించుకుంటున్న మాటూరి రమేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య డిమాండ్ చేశారు. మండలంలోని బానాజీపేట గ్రామానికి చెందిన రమేశ్ సోమవారం తాటి చెట్టు ఎక్కుతుండగా మోకుజారి పడి మృతి చెందగా మంగళవారం సంఘం నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా పేద కుటుంబం కావడంతో రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కమిటీ సభ్యులు శ్రీనివాస్, వెంకటేష్, మహేందర్, కృష్ణ, అంజయ్య, రాజు, రాజయ్య, లక్ష్మీనారాయణ, మల్లయ్య ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



నర్మెట: ఆర్థికసాయం అందజేస్తున్న సర్పంచ్ కమలాకర్‌రెడ్డి



బచ్చన్నపేటలో..

నర్మెట /బచ్చన్నపేట: మండల కేంద్రానికి చెందిన పులి భద్రయ్య (67), బైరోజు రాములు (65) అనారోగ్యంతో మృతిచెందారు. కాగా, నర్మెట సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించి ఇరు కుటుంబాలకు రూ. 5 వేల చొప్పున ఆర్థికసాయం మంగళవారం అందజేశారు. బచ్చన్నపేట మండలం పోచన్నపేటకు చెందిన కర్రె కమలమ్మ (60) మృతిచెందగా సామాజిక సేవా కార్యకర్త పోతు రాములు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 5వేలు అందించారు. పరామర్శించిన వారిలో వార్డు సభ్యుల పాతూరి శేఖర్, పొన్నం బాలకృష్ణ, పులి నర్సింహులు, గొడుగు రవి, గ్రామస్తులు తుప్పతి చంద్రయ్య, రామచంద్రం, బాబు, సత్యనారాయణ ఉన్నారు.

బియ్యం అందజేత

పాలకుర్తి టౌన్: మండల కేంద్రానికి చెందిన ప్రముఖ సంఘ సేవకుడు రాపాక సత్యం తల్లి జయలక్ష్మి(90)మృతి చెందగా బాధిత కుటుంబానికి రాపాక నాగరాజు సహకారంతో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన బియ్యం, నిత్యావసర సరుకులు మంగళవారం అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్, కార్యదర్శి జీడి హరీష్, వర్రె కుమార్, రాపాక శ్రీహరి తదితరులు ఉన్నారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం



నర్మెట: పార్టీ జెండా ఎగురవేస్తున్న సుగుణమ్మ



లింగాలఘణపురం: నెల్లుట్లలో..



బచ్చన్నపేటలో..

నర్మెట /బచ్చన్నపేట: సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలకేంద్రంతోపాటు ఆయాగ్రామాల్లో మంగళవారం ఆపార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జెండా ఆవిష్కరణ చేసి వందన సమర్పణ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక పాలనతో ప్రజలపై పెనుభారం మోపుతున్నాయని, సాయుధపోరాటం ద్వారా 10 లక్షల ఎకరాలను పేదలకు పంచిన ఘనత సీపీఐదేనని అన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పాతూరి ప్రశాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, గ్రామ కార్యదర్శి దేవరకొండ పద్మ, సీపీఐ జిల్లా కార్యదర్శి మంగళంపల్లి జనార్దన్, నాయకులు సుద్దాల యాదగిరి, శాంతయ్య, ప్రతాప్‌రెడ్డి, రమేష్, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మల్కాపూర్‌లో..

చిల్పూరు: సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మల్కాపూర్‌లో పార్టీ జెండాను నాయకుడు బండారి రాజ్‌కుమార్ ఎగురవేశారు. కార్యక్రమంలో పైస రాములు, కట్ట కుమార్, ఎల్లయ్య, వాజ్‌పేయ్, వెంకటయ్య, రచ్చ వెంకన్న, చంద్రమౌళి పాల్గొన్నారు. అలాగే రఘునాథపల్లి మండల కేంద్రంలో మండల కార్యదర్శి కావటి యాదగిరి జెండాను ఎగురవేశారు. నగేష్, అంజయ్య, లక్ష్మయ్య, లచ్చమ్మ, ఎల్లయ్య, లింగయ్య, కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

కష్టజీవుల కోసం పని చేసేది ఎర్రజెండా

జఫర్‌గఢ్: కష్టజీవుల కోసం పనిచేసేది ఎర్రజెండానేనని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జువారి రమేష్ అన్నారు. సీపీఐ ఆవిర్భావ వారోత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలో పార్టీ సీనియర్ నాయకుడు కూరపాటి చంద్రమౌళి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అజయ్, బుచ్చయ్య, ముసలయ్య, వెంకటయ్య, యాకుబ్‌పాషా పాల్గొన్నారు.

కమ్యూనిస్టులో యువత పాత్రతోనే హక్కుల సాధన

దేవరుప్పుల: తాడిత, పీడిత ప్రజానీకం కోసం పోరాటమే ఏకైక మార్గంగా నేటి యువత కమ్యూనిస్టు పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించినప్పుడు హక్కుల సాధన అనివార్యమని సీపీఐ జిల్లా నాయకుడు బిల్లా తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని కడవెండిలో దొడ్డి కొమురయ్య స్మారక భవనం వద్ద భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి జీడి ఎల్లయ్య పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల రాజకీయం కోసం కాకుండా నిస్వార్థంగా నిరంతరం ప్రజా హక్కుల సాధన కోసం కమ్యూనిస్టు పార్టీలో పాటుపడే దిశలో సీపీఐ ముందు వరుసలో ఉంటుందన్నారు. ప్రజాసమస్యల సాధన కోసమే ఎర్రజెండా పార్టీలు మాత్రమే అంకితభావంతో పనిచేస్తాయని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు పెద్ది యాదగిరి గౌడ్, ఎడ్ల సోమనారాయణ, బిజిగం ఎల్లయ్య, యాదగిరి భిక్షపతి, యాకుబ్‌పాషా, భాష తదితరులు పాల్గొన్నారు.

లింగాలఘణపురంలో..

లింగాలఘణపురం: మండలంలోని పలు గ్రామాల్లో సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ మండల కార్యదర్శి సదానందం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నెల్లుట్లలో పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. వీరస్వామి, అంజయ్య, వెంకటేశ్, కుమార్, ఐలయ్య, శ్రీనివాసు, యాదగిరి, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు పెద్దమ్మ బోనాలు



పెద్దమ్మ తల్లి ఆలయం

పాలకుర్తి: పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో నేడు పెద్దమ్మ బోనాల పండుగ నిర్వహించనున్నట్లు మత్స్య సొసైటీ అధ్యక్షుడు దాసరి మధు, కార్యదర్శి దేశబోయిన అశోక్ తెలిపారు. మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. నేడు(బుధవారం) నిర్వహించే వేడుకలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మాజీ మంత్రి ఈటల రాజేందర్ హాజరవుతారని తెలిపారు. పాలకుర్తి ఉప సర్పంచ్ తరాల చంద్రబాబు, ముదిరాజ్ సంఘం నాయకులు మామిండ్ల యాకయ్య, ఎడవెల్లి సోంమల్లు, మామిండ్ల సోమయ్య, దాసరి యాకయ్య, దుంపలి సంపత్, జీడి నిరంజన్, జీడి నాగరాజు, ప్రశాంత్ పాల్గొన్నారు.

కుర్చీల అందజేత



కుర్చీలు అందజేస్తున్న రాజు

స్టేషన్‌ఘన్‌పూర్: రాఘవాపూర్‌కు చెందిన మాజీ వార్డు సభ్యుడు బట్టమేకల రాజుయాదవ్ తన తండ్రి వెంకటయ్య జ్ఞాపకార్థం ఇప్పగూడెంలోని అంగన్‌వాడీ సెంటర్లకు రూ.10వేలు విలువైన 30 కుర్చీలను అందించారు. ఇప్పగూడెంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ సట్ల రాజు చేతుల మీదుగా గ్రామంలోని ఆరు సెంటర్లకుగాను ఒక్కొక్క సెంటర్‌కు ఐదు చొప్పున మొత్తం 30 కుర్చీలను అంగన్‌వాడీ టీచర్లకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కుల పరశురాములు, ఉపసర్పంచ్ పోకల లక్ష్మీనారాయణ, నాయకులు కత్తుల కట్టయ్య, చట్ల యాకయ్య, న్యాయం సంపత్‌రెడ్డి, పల్లె రవీందర్, కారోబార్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఆర్చీ నిర్మాణానికి విరాళం



జనగామ రూరల్: పట్టణంలోని 24వ వార్డులో రామలింగేశ్వరాలయ దేవాలయ ఆర్చీ నిర్మాణానికి రూ. 50 వేల విరాళాన్ని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్ మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగరబోయిన మల్లేష్, కౌన్సిలర్ విజయ్, నాయకులు పవన్, శేఖర్, రాజు, ఆరె ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.